క్లుప్తంగా

పాడి రైతులకు పాల క్యాన్ల పంపిణీ



పాడి రైతులకు పాల క్యాన్లు అందిస్తున్న సర్పంచ్ శివరామ్

కోటవురట్ల: అమూల్ పాల డెయిరీ పాడి రైతులకు సంక్రాంతి కానుక అందజేసింది. పాడి రైతులకు పాల క్యాన్లను సోమవారం సర్పంచ్ పైల శివరామ్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అమూల్ పాల డెయిరీ పాడి రైతుల సంక్షేమానికి పాటుపడుతోందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వడంతో పాటు సంక్రాంతి బోనస్, కానుకలను అందిస్తూ ఆర్థికంగా ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో పాల సంఘం సెక్రటరీ పైల సత్యవతి, పాడి రైతులు పాల్గొన్నారు.

16 మంది పేకాటరాయుళ్లు అరెస్టు

రాంబిల్లి(యలమంచిలి): పేకాడుతున్న 16 మందిని అరెస్టు చేసినట్లు రాంబిల్లి ఎస్ఐ నాగేంద్ర సోమవారం రాత్రి తెలిపారు. రాంబిల్లి మండలంలో దిమిలి, మామిడివాడ, వెల్చూరు గ్రామాల్లో పేకాడుతున్న 16 మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.10 వేలు స్వాధీనపరుచుకున్నట్లు పేర్కొన్నారు.

భోగి మంటల్లో విద్యుత్‌బిల్లులు వేసి నిరసన



భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేస్తున్న సీపీఎం నాయకులు

ఎస్.రాయవరం: ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి నిరసన వ్యక్తం చేశారు. పి. ధర్మవరంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు వినూత్నంగా నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ బిల్లులు పెంచబోమని చెప్పి రాష్ట్ర ప్రజలను మోసం చేసిందన్నారు. రెండు దఫాలు విద్యుత్ బిల్లులు పెంచిందన్నారు. అధికారంలోకి రాకముందు గొప్పలు చెప్పిన సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రూ.18 వేల కోట్లు భారం మోపి ఇబ్బందులకు గురిచేయడం దారుణమన్నారు. 2022 సంవత్సరానికి సర్దుబాబు చార్జీలు ప్రజలపై భారం వేస్తూ, మరో వైపు అదానీకి లొంగి స్మార్ట్ మీటర్ల పేరుతో రూ.15 వేల కోట్ల చార్జీలు పెంచడానికి బరి తెగించిందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎం. లక్ష్మి, ఎస్.భాస్కర్, రమణ, ఎస్. వెంకటలక్ష్మి, నాగమణి పాల్గొన్నారు.

నిరుపేదలకు దుస్తుల పంపిణీ



నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న బల్లా నాగభూషణం

అనకాపల్లి: పేదలు సంక్రాంతి వేడుకలు ఆనందంగా జరుపుకోవాలని సిద్ధార్థ సోసల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం ఆకాంక్షించారు. స్థానిక చిన్నరాజుపేట సాంబశివ ఆలయం ఆవరణలో నిరుపేదలకు సోమవారం ఆయన రూ.10 వేలు విలువ చేసే దుస్తులు పంపిణీ చేశారు.

'జగనన్న కాలనీల పేరు మార్చితే ఉద్యమిస్తాం'

అనకాపల్లి: కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జగనన్న కాలనీల పేరు మార్పు చేస్తూ ఇచ్చిన జీవోలను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమిస్తానని జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు పెతకం జోసెఫ్ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పేదలకు సెంటున్నర స్థలంలో గృహాలు నిర్మిస్తుంటే, అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు అది మృతదేహాన్ని పూడ్చడానికి సరిపోదని, మూడు సెంట్లు ఇవ్వాలని చెప్పారన్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత జగనన్న కాలనీలు పేర్లు మార్చడం తగదన్నారు. ముందు ప్రతి పేదవాడికి మూడు సెంట్లు స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పల్లె ఇంట సందడి



గణపర్తిలో వరి కుప్పలు



జిల్లా స్థాయి ఎడ్లబళ్లు, గుర్రపు పరుగు పోటీలకు సిద్ధంగా ఉన్న మైదానం

- పట్టణాల నుంచి ఇళ్లకు చేరుకుంటున్న ప్రజలు
- గ్రామ గ్రామాన సందడి వాతావరణం
- జిల్లా స్థాయి ఎడ్లబళ్లు, గుర్రపు పరుగు పోటీలకు సిద్ధం

రైతు ఇంట సిరుల పంట.....

సంక్రాంతి అంటేనే గుర్తుకు వచ్చేది కర్షకులు, వ్యవసాయ కూలీల పండుగ. పంట దిగుబడులు ఎంతా బాగుంటే సంక్రాంతి పండుగ సందడి అంతగా ఉంటుంది. ఈ ఖరీఫ్‌లో వరిసాగు ఆశాజనకంగా ఉండడంతో రైతులు కూడా సంతోషంగా ఉన్నారు. ఖరీఫ్‌కు సంబంధించి మొదట్లో పలు తుపాన్లు రైతులను బెంబేలెత్తించినా వరికోతల సమయంలో వాతావరణం అనుకూలంగా ఉండడంతో హమ్మయ్యా అంటూ ఊపిరి పీల్చుకుంటున్నారు. నాలుగు నెలల పాటు శ్రమించి పండించిన పంట చేతికంది రావడంతో వారి కళ్లలో ఆనందం కనిపిస్తోంది. ఇప్పటికే కొంతమంది వరి నూర్పులు చేసుకోగా, మరికొంత మంది వరి కుప్పలు వేసుకున్నారు. సంక్రాంతి పండుగ తర్వాత నూర్పులు చేసేందుకు సమాయత్తమవుతున్నారు.

మునగపాక: పల్లె.. సంక్రాంతి శోభను సంతరించుకుంది. ఉద్యోగ, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారంతా స్వగ్రామాలకు రావడంతో ప్రతి ఇల్లూ బంధుమిత్రులతో కళకళలాడుతోంది. సోమవారం భోగి పండుగను ఘనంగా జరుపుకున్న ప్రజలు సంక్రాంతి, కనుమ పండుగలను వైభవంగా నిర్వహించడానికి సిద్ధమయ్యారు. మహిళలు ఇళ్ల ముంగిట రంగవల్లులు వేస్తున్నారు. దీనికి తోడు ఖరీఫ్ ఆశాజనకంగా ఉండడంతో రైతులు మెరుగైన దిగుబడుల పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



గంగిరెద్దును పూజిస్తున్న దంపతులు



వాద్రాపల్లిలో యంత్రం ద్వారా సేకరిస్తున్న ధాన్యం

గ్రామాల్లో జానపద కళాకారుల సందడి...

ధనుర్మాసం నుంచే హరిదాసుల సందడి మొదలైంది. హరిలో రంగ హరి అంటూ నెల రోజుల పాటు గ్రామాల్లో తిరిగారు. అయ్యవారికి దండం పెట్టు..అమ్మవారికి దండం పెట్టు అంటూ గంగిరెద్ల వారి ఆట పాటలు, విన్యాసాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. శంభో శంకర అంటూ జంగం దేవర్ల సందడి వంటి కార్యక్రమాలు సంక్రాంతి రోజుల్లో కనిపిస్తున్నాయి. జానపద కళాకారులు అంతా ఈ సంక్రాంతి రోజుల్లో అందరికీ దర్శనమిస్తున్నారు. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలు సంక్రాంతి వేడుకలను తమకున్న పరిస్థితులను బట్టి ఆనందంగా గడుపుకుంటున్నారు.

ఏటా సంక్రాంతి పండగకొస్తుంటాం



ఏటా సంక్రాంతి పండుగకు హైదరాబాద్ నుంచి కుటుంబ సభ్యులతో కలిసి వస్తున్నా. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను స్నేహితులు, బంధువులతో కలిసి ఘనంగా జరుపుకుంటాం. పల్లె వాతావరణం ఎంతో బాగుంటుంది. ఎటువంటి రోగాలు దరిచేరవు. మూడు రోజుల పాటు గ్రామాల్లో సందడి వాతావరణం కనిపిస్తోంది. పుట్టిన గడ్డ మీదకు పండుగ పేరు చెప్పుకొని రావడాన్ని మించిన ఆనందం మరెక్కడా కనిపించదు.

– ఆడారి దానకర్ణ, హైదరాబాద్‌లో స్థిరపడిన మునగపాక వాసి

ఆనందంగా ఉంది



ఖరీఫ్ వరి వరి పైరు నాటిన నుంచి పంట చేతికి అందివచ్చే వరకు భయంభయంగా ఉంటుంది. వరుస తుఫాన్‌లు మొదటిలో ఆందోళనకు గురిచేశాయి. వరి కోతలు చేసే సమయంలో వాతావరణం అనుకూలంగా ఉంది. దీనికి తోడు దిగుబడులు బాగున్నాయి. అధికారుల సలహాలు,సూచనలు పాటించడం ద్వారా వరిలో మంచి ఫలితాలు సాధించగలిగాం. పండగ ఆనందంగా చేసుకుంటాం.

– మారిశెట్టి వెంకటరమణ, రైతు, గణపర్తి

ఘనంగా ముగిసిన మేలుకొలుపులు



మునగపాకలో పరమేశ్వరుని చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు



మూలపేట రామాలయం వద్ద మేలుకొలుపులో భక్తులు

కోటవురట్ల/మునగపాక: గత నెల 17న ధనుర్మాసంలో ప్రారంభమైన మేలుకొలుపుల కార్యక్రమం భోగి పండుగతో ముగిసింది. ఇందులో భాగంగా కోటవురట్ల మండలం పాములవాకలో మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గణపతి, సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి, షిర్డీ సాయిబాబా ఉత్సవ విగ్రహాలతో నగర సంకీర్తన చేశారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు కోలాటం ఆడుతూ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా చిడతల డ్యాన్సు, డప్పు వాయిద్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మునగపాక పల్లపు వీధి వినాయక కమిటీ ఆధ్వర్యంలో పరమేశ్వరుని చిత్రపటాన్ని డప్పువాయిద్యాల నడుమ ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు భక్తులు భారీగా తరలివచ్చారు. వాద్రాపల్లి, గవర్ల అనకాపల్లి, చూచుకొండ, గణపర్తి తదితర గ్రామాల్లో భక్తులు మేలుకొలుపుల కార్యక్రమంలో పాల్గొన్నారు.



పాములవాకలో ఉత్సవమూర్తుల విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

కమనీయంగా గోదాదేవి కల్యాణం



కైలాసపట్నంలో రాజగోపాలస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

కోటవురట్ల: కైలాసపట్నంలో వేంచేసియున్న రుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాలస్వామి వారి ఆలయంలో సోమవారం గోదాదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేద పండితులు శాస్త్రోక్తంగా మంత్రోచ్ఛరణతో కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణాన్ని వీక్షించేందుకు సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

పాయకరావుపేట: పట్టణంలో రాధా రుక్మిణీ సహిత పాండురంగ దేవస్థానంలో గోదాదేవి కల్యాణం నిర్వహించారు. అర్చకుడు కృష్ణస్వామి వేద మంత్రోచ్ఛరణలతో కల్యాణం జరిపించారు. ఇక్కడ ఆలయ ఆవరణలో భోగి మంటలు వేశారు. మంగవరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదా కల్యాణం అతి వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణం తిలకించారు.



పాండురంగ ఆలయంలో గోదా కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు కృష్ణస్వామి



పాండురంగ ఆలయంలో భోగి మంట వేసిన దృశ్యం

ఇంటింటా భోగి భాగ్యాలు



గెద్దపాలెంలో భోగి మంట కాగుతున్న యువకులు



యలమంచిలి టిడ్కో కాలనీ వద్ద భోగి మంటలు వేస్తున్న స్థానికులు



దార్లపూడిలో గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి రూరల్: సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా భోగి పండుగను చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ బంధుమిత్రులతో కలిసి ఉత్సాహంగా జరుపుకున్నారు. యలమంచిలి పట్టణం, గ్రామాల్లో సోమవారం ఉదయం వేకువజాము నుంచే ప్రతి ఇంటి ముందు భోగి మంటలు వేసి ఆనందించారు. యువకులు, పిల్లలు వీధుల్లో పెద్ద ఎత్తున భోగి మంటలు వేసి, నృత్యాలు చేస్తూ సందడి చేశారు. మహిళలు పెద్ద ఎత్తున పోటీపడి ఇళ్ల ముందు రంగు రంగుల ముగ్గులు తీర్చిదిద్దారు. దీంతో యలమంచిలి పట్టణం, మండలంలోని గ్రామాల్లో సంక్రాంతి శోభ కనిపించింది. ఉపాధి కోసం, ఉద్యోగాల నిమిత్తం నగరాలకు వలస వెళ్లిన వారంతా సంక్రాంతి పండుగను పురస్కరించుకుని తిరిగి సొంత గ్రామాలకు చేరుకోవడంతో పల్లెలు కళకళలాడుతున్నాయి. యలమంచిలి పట్టణంలో రెండ్రోజుల నుంచి వస్త్ర, కిరాణా దుకాణాలు, బజార్లు కిటకిటలాడుతున్నాయి. పండుగ జరుపుకోవడానికి కావాల్సిన సరుకులు కొనుగోలు చేయడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు యలమంచిలి చేరుకోవడంతో స్థానిక పాత ప్రభుత్వాస్పత్రి, దిమిలి రోడ్డు, వైఎస్సార్ కూడళ్లు రద్దీగా కనిపించాయి. గ్రామాల్లో బంధుమిత్రులతో కలిసి పిండివంటలు చేసుకోవడం, కోడిపందాలు, గుర్రపు పరుగు పోటీలు, క్రికెట్, ముగ్గుల పోటీల నిర్వహణతో సంక్రాంతి సందడి నెలకొంది. పలుచోట్ల వేంకటేశ్వరస్వామి, రామాలయాలు, వేణుగోపాల స్వామి ఆలయాల్లో గోదాదేవి కల్యాణోత్సవాలు కనులపండువగా నిర్వహించారు. కుటుంబ సమేతంగా పలువురు ఈ కల్యాణాల్లో పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం

ఎస్.రాయవరం: ధనుర్మాసోత్సవాలు ముగిసిన సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో సోమవారం గోదాదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఎస్.రాయవరంలో వైభవ వేంకటేశ్వరస్వామి, దార్లపూడిలో కల్యాణ వేంకటేశ్వరస్వామి, కొరుప్రోలులో సీతారామస్వామి తదితర ఆలయాల్లో గోదాదేవి కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుక వీక్షించారు.



తులసీనగర్ రామాలయంలో గోదాదేవి కల్యాణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి దంపతులు

వేకువజాము నుంచే భోగి స్నానాలు...

మండలంలో భోగి పండగ సోమవారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో యువకులు వేకువజాము నుంచి భోగి స్నానాలు చేసి వీధుల్లో చలిమంటలు వేసి సందడి చేశారు. అనంతరం ఆలయాల్లో దర్శనాలు చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అచ్యుతాపురం: మండలంలో భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజాము నుంచే ప్రజలు స్నానాలు ఆచరించి పొలాల్లో భోగి మంటలు వేశారు. పలు గ్రామాల్లో నిర్వహించిన మేలుకొలుపులు ముగిశాయి. సుదూర ప్రాంతాలకు చెందిన స్థానికులు సొంత గ్రామాలకు తరలిరావడంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. పలు గ్రామాల్లో తీర్థాలు మొదలయ్యాయి.

ఐదుగురు పేకాట రాయుళ్లపై కేసు

రూ.8,920 స్వాధీనం

అనకాపల్లి: జూదం ఆడుతున్న ఐదుగురిపై పట్టణ పోలీస్‌లు కేసు నమోదు చేశారు. అజ్ఞాత వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు పట్టణంలో పెద్ద రెల్లివీధి వెనుక భాగాన జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.8,920 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు చెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గ్రామగ్రామాన భోగి సందడి



మునగపాక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో భోగి వేడుకల్లో బొడ్డేడ ప్రసాద్, తదితరులు



భోగి పండుగలో భాగంగా ఒకేచోట కలుసుకున్న వెలగా వారి కుటుంబ సభ్యులు

నక్కపల్లి: గ్రామగ్రామాన భోగి పండుగను ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. తెల్లవార్లూ యువత, కుర్రకారు మేల్కొని భోగి మంటలు వేసే పనిలో నిమగ్నమయ్యారు. అర్ధరాత్రి పల్లెల్లో చిమ్మచీకట్లు చీల్చుకుంటూ భోగి మంటలు వెలుగురేఖలను నింపాయి. చాలా గ్రామాల్లో వీధుల్లోనూ భోగి మంటలు వేసుకుని ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా పలువురు ఇంట్లో ఉన్న పాత వస్తువులను తెచ్చి భోగి మంటల్లో వేశారు. ఆవు పిడకలను మంటల్లో వేస్తూ గ్రామానికి పట్టిన దోషం పోవాలని కోరారు. చాలా ఇళ్లలో సాయంత్రం చిన్నారులకు భోగిపళ్లు పోసే కార్యక్రమాన్ని నిర్వహించారు. పండగ సందర్భంగా బంధువులు, కొత్త అల్లుళ్ల రాకతో ఇళ్లన్నీ కళకళలాడాయి. పిండివంటలతో ఘుమఘుమలాడాయి. ఉపమాక వెంకన్న ఆలయానికి భక్తుల ఎక్కువగా వచ్చి దర్శనం చేసుకున్నారు. ధనుర్మాసం పూర్తికావడంతో ఆండాళ్లమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. గోదాదేవి కల్యాణాన్ని తిలకించారు. ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు, గొబ్బెమ్మలతో లోగిళ్ల ప్రత్యేకతను సంతరించుకున్నాయి.

కోటవురట్ల: భోగి పండగను మండలంలో సోమవారం వైభవంగా జరుపుకున్నారు. వేకువజామునే లేచి తలంటిస్నానం చేసి భోగిమంటలు వేసుకుని సందడి చేశారు. బంధుమిత్రులు, కొత్తల్లుళ్ల రాకతో లోగిళ్లు సందడిగా మారాయి. ఇంటిల్లిపాదీ సంతోషంగా గడిపారు. పలు గ్రామాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కె.వెంకటాపురంలో కోలాటం ఆడి సీతారాముల పల్లకిని ఊరేగించారు.



మునగపాకలో భోగి పండుగ వేడుకలు

మునగపాక: సంక్రాంతి పర్వదిన వేడుకల్లో భాగంగా గ్రామాల్లో భోగి పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. పిల్లల నుంచి యువకులు, పెద్దల వరకు వేకువజామునే నిద్రలేచి కేరింతలు కొడుతూ పొలాల్లో ఏర్పాటు చేసిన పందిళ్ల వద్ద భోగి వేడుక చేసుకున్నారు. పందిళ్లకు నిప్పంటించి భోగి మంట.. పొయ్యిలో పిడక అంటూ నినదిస్తూ సందడి చేశారు. పలు చోట్ల అల్పాహారాలు ఏర్పాటు చేసుకున్నారు. మునగపాక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భోగి వేడుకల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు తదితరులు పాల్గొని ఉత్సాహంగా గడిపారు. ఉమ్మలాడ రామాలయంలో గోదాదేవి కల్యాణం ఘనంగా జరిగింది.



ఉమ్మలాడ రామాలయంలో గోదాదేవి కల్యాణంలో భక్తులు



కోటవురట్లలో భోగిమంట కాగుతున్న దృశ్యం



కె.వెంకటాపురంలో కోలాటం ఆడుతున్న భక్తులు

ప్రతి ఒక్కరూ సేవాతత్పరత అలవరుచుకోవాలి

పేదలకు దుప్పట్లు పంపిణీ చేసిన బొడ్డేడ ప్రసాద్



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: ప్రతి ఒక్కరూ సేవాతత్పరత అలవరుచుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాక నందీశ్వర కళా ప్రాంగణంలో ఆడారి అప్పలనరసయ్య(దొరమ్మ) జ్ఞాపకార్థంగా అతని కుమారుడు అప్పలనాయుడు ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో ప్రసాద్ మాట్లాడారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా ఏటా పేదలకు దుప్పట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అప్పలనాయుడును ఆదర్శంగా తీసుకొని పేదలకు సేవలందించాలన్నారు. ఎస్ఐ పి.ప్రసాదరావు మాట్లాడుతూ గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. దీనిలో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, జనసేన పార్టీ మండల కన్వీనర్ టెక్కలి పరశురామ్, పాల సంఘ అధ్యక్షులు మళ్ల సంజీవరావు, మళ్ల జోగారావు, ఆడారి రమణబాబు, కేవీఎస్ అప్పారావు, ఆడారి కాశీబాబు, కోనపల్లి రామ్మోహనరావు, ఆడారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మునగపాకలో ముగ్గు వేస్తున్న మహిళ